

చీనీ టన్ను రూ. 20 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 264 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.13, కనిష్టం రూ.3.50, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.4°/22.6°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ



కదిరి అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్, కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, డేటా రికవరీ ఏజెంట్, తదితర కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ ఆపై ఉన్నత విద్య చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9390176421 నంబరులో సంప్రదించాలన్నారు.

93 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



ఇరగరాజుపల్లిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మౌనిక

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత కింద అందించే 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. తొలిరోజు ఇంటింటికీ వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేసిన వలంటీర్లు రెండో రోజు శనివారం లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి పింఛన్ అందజేశారు. దీంతో రెండో రోజు నాటికే జిల్లాలో 93 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలో మొత్తం 2,66,668 మంది పింఛన్‌దారులుండగా, ప్రభుత్వం రూ.74,04,56,250 నగదు మంజూరు చేసింది. వలంటీర్లు రెండు రోజుల్లో 2,47,148 మందికి రూ.68,62,07,750 మొత్తం అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. పింఛన్ పంపిణీకి మరో మరో మూడు రోజుల గడువు ఉందన్నారు. వలంటీర్లే వెతుక్కుంటూ వచ్చి మరీ పింఛన్ మొత్తం అందించడంతో లబ్ధిదారులు ఆనందపడ్డారు. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన వారు చేతులెత్తి మొక్కారు.

రీ సర్వే వేగవంతం చేయాలి



రీ సర్వేపై సమీక్షిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూ రక్ష' కింద చేపట్టిన రీసర్వే వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని వీసీ హాలులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. మూడో దశలో పుట్టపర్తి డివిజన్‌లోని 58 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ జరుగుతోందని, సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నవంబర్‌లోపు పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే ఏడీ రామకృష్ణ, ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

రాజన్నకు నీరాజనం

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- ప్రముఖుల నివాళి.. సేవాకార్యక్రమాల నిర్వహణ
- పలు చోట్ల అన్నదానం, బ్రెడ్లు, పండ్లు, దుప్పట్ల పంపిణీ



ధర్మవరంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, పుట్టపర్తి: ప్రతి అభిమాని హృదయమూ రాజన్నా అని పలికింది. ఊరూవాడా మహానేతను తలచుకుంది. వాడవాడలా సేవా కార్యక్రమాలతో రాజన్నకు ఘన నివాళులర్పించింది. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాల వద్ద పూలమాల వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం, రక్తదానం, దుప్పట్ల పంపిణీ, రోగులకు బ్రెడ్లు అందజేత తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, వైఎస్ అభిమానులు గుండె గుడిలోని జ్ఞాపకాలను తలచుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఏ ఆపదవచ్చినా నేనున్నానంటూ భరోసా ఇచ్చే వైఎస్సార్‌తో తమ అనుబంధాన్ని పంచుకున్నారు. ప్రతి పేద వాడి గుండెల్లో రాజన్న బతికే ఉన్నారనీ, భౌతికంగా దూరమైనా ఆయన అమలు చేసిన ప్రతి సంక్షేమ పథకం రూపంలో బతికే ఉన్నారన్నారు. వైఎస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు.

- పెనుకొండలోని మడకశిర సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే శంకరనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ పాలనపై ప్రశంసల వర్షం కురిపించారు. రాజన్న ఆశయ సాధన కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.
- కదిరిలో వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీరేపల్లిపేట, తనకల్లులో వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- హిందూపురం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కేఎన్ దీపిక ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. హిందూపురంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లేపాక్షిలో వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- ధర్మవరం నడిబొడ్డున ఉన్న వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, బత్తలపల్లిలో ఎంపీపీ త్రివేణి, తాడిమర్రిలో డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.
- మడకశిర మున్సిపాలిటీ పరిధిలో నాయకులందరూ కలిసి వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు.
- పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు డీఎస్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కొత్తచెరువు మండలం బండ్లపల్లిలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాన్ని ఊరేగించారు.
- రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మామిళ్లపల్లిలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.
- హిందూపురం పార్లమెంటు సభ్యుడు గోరంట్ల మాధవ్ అనంతపురంలోని జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన వెంట నసనకోట ముత్యాలమ్మ ఆలయ చైర్మన్ కురుబ ముత్యాలన్న ఉన్నారు.



పెనుకొండలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



అనంతపురంలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్



హిందూపురంలో అన్నదానం చేస్తున్న పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక



కొత్తచెరువు మండలం బండ్లపల్లిలో వైఎస్ చిత్రపటం ఊరేగింపు



తనకల్లులో వైఎస్సార్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి, కడపల మోహన్‌రెడ్డి

భూ సేకరణ వేగవంతం చేశాం

- జిల్లాలోని సచివాలయాల్లో 236 ఖాళీలు
- సీఎస్‌కు తెలిపిన కలెక్టర్ అరుణ్‌బాబు



సీఎస్ సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లా పరిధిలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల కోసం అవసరమైన భూ సేకరణ వేగవంతం చేశామని కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డికి తెలిపారు. శనివారం జవహర్‌రెడ్డి విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా మాట్లాడారు. మార్క్‌ఫెడ్ గోడౌన్‌లు, జాతీయ రహదారులు, మొబైల్ టవర్ల కోసం భూ సేకరణ, జగనన్న పాలవెల్లువ, చిరుధాన్యాల సాగు, ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీల భర్తీ, జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... జిల్లాలో భూ సేకరణకు చర్యలు చేపట్టామన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమం 71 గ్రామాల్లో సాగుతోందని, త్వరలోనే మరిన్ని గ్రామాలకూ విస్తరిస్తామన్నారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో 236 ఖాళీలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటి వివరాలపై నివేదిక పంపుతామన్నారు. రీ సర్వేపై డివిజన్ల వారీగా సమీక్షలు నిర్వహించి పనులు వేగవంతం చేస్తున్నట్లు సీఎస్‌కు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, పశు సంవర్ధకశాఖ అధికారి శుభదాస్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు ఎస్‌ఐ లింగన్న

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు ఎస్‌ఐ లింగన్నను వీఆర్‌కు పంపారు. అనంతపురం జిల్లా పాల్తూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సురేష్‌బాబును కొత్తచెరువు ఎస్‌ఐగా నియమించారు. ఎస్‌ఐ లింగన్నపై ఇటీవల పలు ఆరోపణలు వెల్లువెత్తగా, ఎస్పీ మాధవరెడ్డి చర్యలకు ఉపక్రమించారు. వీఆర్‌కు పంపుతూ మిగతా అధికారులకూ హెచ్చరికలు జారీ చేశారు. అయితే దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

కష్టకాలంలో కారుణ్యం

- ఆర్టీసీలో కారుణ్య నియామకాలు
- బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్న జగన్ సర్కార్
- ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మందికి ఉద్యోగాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు



పుట్టపర్తి టౌన్: ఆర్టీసీలో నూతన శకం ఆరంభమైంది. టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఆర్టీసీకి వైఎస్సార్ సీపీ సర్కార్ జవసత్వాలు నింపుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు చేపట్టారు. 2020లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి పబ్లిక్ ట్రాన్స్ పోర్టు డిపార్టుమెంట్‌గా మార్చారు. దీంతో ఆర్టీసీ రూపురుఖలు మారిపోయాయి. అలాగే మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగి కుటుంబాలకు అండగా నిలిచారు. కారుణ్య నియామకాలు చేపట్టి బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు.

23 మందికి కారుణ్య నియామకాలు..

జిల్లాలో ఆరు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వివిధ కారణాలతో 2016–19 మధ్య కాలంలో 48 మంది ఆర్టీసీ ఉద్యోగులు చనిపోయారు. బాధిత కుటుంబాలకు భరోసా నింపడానికి కారుణ్య నియామకం కింద ఆయా కుటుంబాల్లో 23 మందికి ఆర్టీసీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో వారంతా జగన్ సర్కార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వేడుకున్నా కరుణించని చంద్రబాబు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కారణాలతో 1,168 మంది ఆర్టీసీ ఉద్యోగులు చనిపోగా, అందులో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఉద్యోగులు 48 మంది ఉన్నారు. కారుణ్య నియామకాల కింద బాధిత కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆర్టీసీ సంఘాల నేతలు, బాధిత కుటుంబీకులు వేడుకున్నా అప్పట్లో చంద్రబాబు ఏ మాత్రం పట్టించుకోలేదు. అప్పట్లో కార్పొరేషన్‌గా ఉన్న ఆర్టీసీలో ఉద్యోగం ఇవ్వడం సులువైనప్పటికీ చంద్రబాబుకు మనస్సు రాలేదు. కారుణ్య నియామకాల చేపట్టాలని కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు పలుమార్లు ధర్నాలు చేసినా కనీసం స్పందించలేదు.

మాట నిలబెట్టుకున్న జగన్..

తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆర్టీసీకి ప్రాణం పోశారు. అలాగే ఉద్యోగుల సంక్షేమానికి పలు చర్యలు చేపట్టారు. మానవతా దృక్పథంతో ఆలోచించి కార్మికులు సంక్షేమం కోసం ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసి కార్మికుల జీవితాలలో వెలుగు నింపారు. ఆర్టీసీ ప్రజా రవాణా శాఖగా మారిన తర్వాత కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని 23 మందికి కారుణ్య నియామకాల కింద వివిధ శాఖల్లో ఉద్యోగాలు కల్పించారు.

మరో 34 మందికి అవకాశం..

2020 జనవరి 1వ తేదీ తర్వాత ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా మరో 34 మంది ఆర్టీసీ ఉద్యోగులు చనిపోయారు. వీరి కుటుంబసభ్యులు కూడా కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ ఫైళ్లను ఆర్టీసీ అధికారులు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. వీరికి త్వరలోనే వివిధ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.

యూనియన్ల హర్షం..

గతంలో ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చినా, ధర్నాలు చేసినా తీరని సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని దీర్ఘ కాలంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు సంబంధించి మృతి చెందిన కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం హర్షణీయమని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, ఎన్ఎంయూ, వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్‌తోపాటు పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధిత కుటుంబాలకు ఊరట



కుటుంబ యజమాని మృతితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి కారుణ్య నియామకంతో ఊరట లభిస్తుంది. 2016– 19 మధ్య 23 మంది ఆర్టీసీ ఉద్యోగులు మృతి చెందారు. ఆయా కుటుంబాల్లోని వారికి కారుణ్య నియామకం కింద వివిధ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాం. 2020 తర్వాత 34 మంది ఉద్యోగుల మృతి చెందారు. ఆయా కుటుంబాల్లోని వారికీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దరఖాస్తులు పరిశీలించి నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. అనుమతులు మంజూరు కాగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.

– మధుసూదన్, జిల్లా ప్రజా రవాణా అధికారి

'సాయి సమర్పయామి'



సంగీత కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

- ఘనంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

ప్రశాంతి నిలయం: సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ గోల్డెన్ జూబ్లీ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ 51వ వసంతంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా శనివారం ప్రశాంతి నిలయంలో గోల్డెన్ జూబ్లీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సన్నిధిలో సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు, ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు 'సాయి సమర్పయామి' పేరుతో సెంట్రల్ ట్రస్ట్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొనియాడుతూ సంగీత విభావరి నిర్వహించారు. విద్యార్థుల విభావరి భక్తులను అలరించింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

8లోపు బయోమెట్రిక్ వేయించాలి

అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం అందించే మైనార్టీ ఉపకార వేతనాల కోసం 2022– 23 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో ఈ నెల 8లోగా బయోమెట్రిక్ నమోదు చేయించాలని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బయోమెట్రిక్ నమోదులో సాంకేతిక సమస్యల పరిష్కారానికి కామన్ సర్వీస్ సెంటర్ వీఎల్‌ఈఓలు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో పర్యటిస్తారని, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ పూర్తయిన విద్యార్థుల వివరాలను పరిశీలించి ఈ నెల 11లోగా జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్‌కు అంత్యక్రియలు


నివాళులర్పిస్తున్న సీఐ చిన్నగౌస్

చెన్నేకొత్తపల్లి: ఢిల్లీలో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ ఉమామహేష్‌కు ఆయన స్వగ్రామం మేడాపురంలో శనివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఉదయం ఆయన పార్థివ దేహాన్ని గ్రామస్తుల సందర్శనార్థం స్వగృహం వద్ద ఉంచారు. రామగిరి సీఐ చిన్నగౌస్, సీకె పల్లి ఎస్‌ఐ శ్రీధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శ్మశాన వాటికలో సైనిక వందనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడి దుర్మరణం


మృతుడు గోపాల్

గుత్తి రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆస్పరి మండలం నగరూరు గ్రామానికి చెందిన గోపాల్ (34) శుక్రవారం తొండపాడులో బంధువుల ఇంట జరిగే శుభకార్యానికి హాజరయ్యారు. అదే రోజు అర్ధరాత్రి కల్యాణమంటపం ఎదురుగా ఉన్న హోటల్ వద్దకు వెళుతుండగా తాడిపత్రి నుంచి గుత్తి వైపుగా బండల లోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఘటనలో తలకు బలమైన గాయమై గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మధుమోహన్.. గుత్తి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెంకట్రామిరెడ్డి తెలిపారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



ప్రత్యేక అలంకరణలో సైదాపురం ఆంజనేయస్వామి, ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులు

కదిరి టౌన్: శ్రావణ మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకుని కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి, సైదాపురం ఆంజనేయస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి, ద్వారక ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి ఆలయాలు భక్తులు కిక్కిరిసాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించి, మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు.



నల్లచెరువు: అలంకరణలో పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి, ఆలయం బయట బారులు తీరిన భక్తులు

భక్త జనసంద్రమైన పాలపాటిదిన్నె

నల్లచెరువు: శ్రావణ మూడో శనివారాన్ని పురస్కరించుకుని మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయం భక్తజన సంద్రమైంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. వేకువజామునే అర్చకులు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

'ఓపెన్ డిగ్రీ' అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాప్తాడు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ గ్రూపుల్లో ప్రథమ సంవత్సర ప్రవేశ దరఖాస్తు గడువును ఈ నెల 5 వరకు పొడిగించినట్లు మహిళా అభ్యసన సహాయ కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.లక్ష్మీరంగయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 20 వరకు, రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, నర్సింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08554–245908, 94901 21294 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు శనివారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. శుక్రవారం రాత్రి కల్లూరులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసుంటుందని నిర్ధారించారు. ధరించిన తెలుపు రంగు షర్ట్‌పై నీలం రంగు గీతలున్నాయి. ముదురు నీలం రంగు ప్యాంట్ వేసుకున్నాడు. గుండు చేయించాడు. ఆచూకీ తెలిసిన వారు 99088 37888, 85002 38200కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

బ్యాంకు ఖాతాలోని నగదు మాయం!

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లికి చెందిన తల్లి హంసాదేవి, కుమారుడు నరేష్ బ్యాంకు ఖాతాల నుంచి రూ.50వేలు నగదు మాయమైంది. ఈ విషయాన్ని శనివారం గుర్తించిన బాధితులు తమ ఖాతాలున్న గుత్తి ఆర్‌ఎస్‌లోని స్టేట్ బ్యాంక్ అధికారులను కలసి ఆరా తీశారు. ఆయా ఖాతాలను పరిశీలించిన అధికారులు హంసాదేవి ఖాతా నుంచి గత నెల 29వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకు రోజూ రూ.10వేలు చొప్పున రూ.40 వేలు.. నరేష్ ఖాతా నుంచి జూన్ 30న రూ.10వేలు మరో ఖాతాకు బదిలీ అయినట్లు గురించారు. ఇది సైబర్ నేరగాళ్ల పనిగా నిర్ధారించి, బ్యాంక్ అధికారులు విచారణ చేపట్టారు.

ద్విచక్ర వాహనాల ఢీ – ఇద్దరి మృతి

విడపనకల్లు: మండలంలోని హంచనహాల్ – పాలికి గ్రామాల మధ్య శనివారం రాత్రి ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లు నివాసి బాలు (20), మరో వ్యక్తితో కలసి పాలికి గ్రామం వైపు మిరప పంటకు కాపలా ఉండేందుకు ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి బయలుదేరాడు. అదే సమయంలో పాలికి గ్రామానికి చెందిన వర్ధన్ (18), మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై కసాపురం వెళుతూ ఢీకొన్నారు. ఘటనలో బాలు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వర్ధన్‌ను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలిస్తుండగా గుత్తి సమీపంలో మృతిచెందాడు. ఎస్‌ఐ తిప్పయ్య నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

5న జంప్‌రోప్ జిల్లా జట్ల ఎంపిక

నల్లమాడ: స్థానిక పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల మైదానంలో ఈ నెల 5వ తేదీన జిల్లా జంప్ రోప్ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జంప్ రోప్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల్లో ఎంపికైన వారు ఈనెల 9, 10 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు నుంచి ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. వివరాలకు 9959847080 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అయ్యవారూ.. ఇదేమి తీరు?

- మహిళా ఉపాధ్యాయులతో అసభ్య ప్రవర్తన
- వెంటపడి పాటలు పాడుతూ వెకిలి చేష్టలు
- పాఠశాలకు ఆలస్యంగా వస్తూ పోకిరి వేషాలు


ఎంఈఓ 1, 2కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు షాకీర్ బాషా తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పి, మంచి నడవడిక నేర్పాల్సిన అయ్యవారే గతి తప్పి మహిళా ఉపాధ్యాయులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో ఈ టీచర్ మాకొద్దంటూ ఎంఈఓ 1, 2ను పిలిపించి పంచాయితీ నిర్వహించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు...

విధులకు రోజూ ఆలస్యం

ఉపాధ్యాయుడు షాకీర్ బాషా రోజూ విధులకు ఆలస్యంగా రావడమే కాక.. వచ్చినప్పటి నుంచి తరచూ ఏదో ఒక అంశంలో ఉపాధ్యాయులతో ఘర్షణ పడుతుండడం వివాదాస్పదమైంది. మహిళా ఉపాధ్యాయులతో అసభ్యకరంగా ప్రవర్తించడం, వారి వెనుక పాటలు పాడుతూ వెకిలి చేష్టలు చేస్తుండడంతో భరించలేక విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు.

మాకొద్దంటే వద్దు

షాకీర్ బాషా తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం పాఠశాలకు ఎంఈఓలు మల్లికార్జున, ఈరన్నను పిలిపించి పంచాయితీ నిర్వహించారు. సరైన సమయానికి పాఠశాలకు రాకపోవడంతో పాటు, వచ్చినప్పటి నుంచి మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడని మండిపడ్డారు. విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా సెల్‌ఫోన్లు ఇచ్చి మహిళా ఉపాధ్యాయుల ఫొటో తీయిస్తూ, వారి వెంట పడి పాటలు పాడుతూ వెకిలి చేష్టలకు పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డుపెట్టుకుని అప్పట్లో తాను పనిచేసిన కల్లుహోళ పాఠశాలకు సక్రమంగా హాజరు కాకుండా బయోమెట్రిక్ అటెండెన్స్ వేస్తూ అధికారులకు పట్టుబడ్డారని గుర్తు చేశారు. ఆ సమయంలోనే సస్పెండ్ అయి తిరిగి గోవిందవాడ పాఠశాలకు వచ్చారని గుర్తు చేశారు. ఆయన తీరు వల్ల పిల్లలు చెడిపోతారని భయాందోళనలు వ్యక్తం చేస్తూ ఇక్కడి నుంచి పంపేయాలంటూ డిమాండ్ చేశారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

ఉపాధ్యాయుడు షాకీర్ బాషాపై కొన్ని రోజులుగా వివిధ రకాల ఫిర్యాదులు అందుతున్న మాట వాస్తవం. గతంలోనూ ఆయన ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ప్రస్తుతం అదే తీరు కొనసాగిస్తూ తోటి ఉపాధ్యాయులతో గొడవ పడుతున్నట్లుగా తెలిసింది. గ్రామస్తులు మూకుమ్మడిగా ఫిర్యాదు చేసిన అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. – మల్లికార్జున, ఎంఈఓ

నవోదయలో 'విజ్ఞాన జ్యోతి'


విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో శనివారం అనంతపురంలోని జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో విజ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు మాట్లాడుతూ.. దేశంలో సైన్స్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్, మేథమెటిక్స్ (స్టెమ్) రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని, ఈ లోపాన్ని అధిగమించేందుకు ప్రతిభావంతులైన బాలికల అన్వేషణలో భాగంగా జేఎన్‌టీయూ (ఏ) సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి బాలికలకు సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలు, మేథమెటిక్స్ సీ స్టెమ్ కిట్లు పంపిణీ చేశారు. ఇవే అంశాలపై 12వ తరగతి విద్యార్థినులకు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్, ఇంజినీరింగ్ విభాగాల అధిపతుల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం రసాయన శాస్త్ర పీజీటీ ముంతాజ్‌బేగం పర్యవేక్షణలో జరిగింది.

చెట్టును ఢీకొన్న కారు

- ఐదుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన కారు

బత్తలపల్లి: చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం కునుకుంట్లలో శనివారం కొవ్వూరు సూర్యనారాయణరెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమానికి అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన దంపతులు సరోజమ్మ, కొండారెడ్డి(కారు డ్రైవర్/ఓనర్), అనంతపురానికి చెందిన శివమ్మ (టీవీ టవర్), సావిత్రి (రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో టీచర్), పద్మావతి (మంగపట్నం) కారులో వెళ్లారు. శుభకార్యం ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. బత్తలపల్లి మండలం మాల్యవంతం సమీపంలోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డుపై ఏర్పడిన గుంతలోకి కారును నడపడంతో అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొంది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సౌత్‌జోన్ జట్టుకు ఎంపిక


కె.భావనా రెడ్డి


కె.మమత

అనంతపురం: మంగళగిరిలో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరగనున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్–23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొనే సౌత్‌జోన్ జట్టుకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి కె.భావనా రెడ్డి, కె.మమత ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.మధు ఆచారి తెలిపారు. నార్పల మండలం బండ్లపల్లికి చెందిన భావనా రెడ్డి లెఫ్టార్మ్ మీడియం పేసర్. 2022–23 సీజన్‌లో ఆంధ్ర అండర్–19 జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఆరు వికెట్లు సాధించింది. పెనుకొండకు చెందిన మమత కుడి చేతి మిడిల్ ఆర్డర్ బ్యాటర్, రైట్ ఆర్మ్ స్పిన్నర్. గతంలో జరిగిన అంతర్ జిల్లాల మ్యాచుల్లో గణనీయమైన ప్రతిభ చాటింది.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ


గుంతకల్లు రూరల్: ఐరావత వాహనంపై కొలువుదీరిన సీతారాముల ఉత్సవ మూర్తులు

గుంతకల్లు రూరల్/బొమ్మనహాళ్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మూడో శనివారం కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. హనుమాన్ నామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. వేకువజామునే ఆలయాల్లో విశేష అభిషేకాలు, అర్చనలు, కసాపురంలో స్వర్ణ కవచ అలంకరణ, నేమకల్లులో వెండి కవచధారణ, బంగారు కిరీటధారణ, వెండి తమలపాకుల అలంకరణ, ఆకుపూజలు, లక్ష తులసి అర్చన పెద్ద ఎత్తున జరిగాయి. కసాపురంలో పెరవళి పారారామన్న కుమారుల ఆధ్వర్యంలో భక్తులకు చక్కెర పొంగలి అందజేశారు. నేమకల్లులో బళ్లారికి చెందిన జెల్లె హనుమంతప్ప, మీనాక్షమ్మ సౌజన్యంతో అన్నదానం ఏర్పాటు చేశారు. కసాపురంలోని బెల్దోణ సత్రంలో నిరంతర అన్నదానం కొనసాగింది. కసాపురంలో సాయంత్రం సీతారాముల ఉత్సవ మూర్తులను ఐరావత వాహనంపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు.


బొమ్మనహాళ్: తులసీ అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి మూలవిరాట్


గుంతకల్లు రూరల్: భక్తులతో కిటకిటలాడుతున్న కసాపురం ఆలయం